క్లుప్తంగా

దక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం వద్ద దక్షిణామూర్తికి ఈఓ కె.ఎస్.రామరావు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి దక్షిణం వైపు ప్రతిష్ఠించిన దక్షిణామూర్తి విగ్రహానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించగా, ఈఓ పాల్గొన్నారు. దక్షిణామూర్తి దర్శనం, పూజతో కలిగే ఫలితాలను ఆలయ అర్చకులు వివరించారు. ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఏఈఓ ఎస్.రమేష్‌బాబు, ఇతర ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నేడు ఐఐటీ, జేఈఈపై అవగాహన సదస్సు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఇంటర్మీడియెట్‌తో పాటు ఐఐటీ, జేఈఈకి ఎలా సన్నద్ధం అవ్వాలనే అంశంపై శరత్‌చంద్ర ఐఐటీ అకాడమీ, శరత్‌చంద్ర జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ తోట శరత్‌చంద్ర తెలిపారు. ఎంజీరోడ్డులోని తమ అకాడమీలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ఐఐటీ, జేఈఈకి ఎలా ప్రిపేర్ అవ్వాలి, ఏ పుస్తకాలు చదవాలి, ఏటాపిక్స్ ఎక్కువగా ఫోకస్ చేయాలనే అంశాలపై ఆల్ ఇండియా ఆరో ర్యాంకు సాధించిన కార్తికేయ వివరిస్తారని, విద్యార్థులు సైతం సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల వరకూ ఈ సదస్సు జరుగుతుందన్నారు.

ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థులు ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ర్యాంకులు సాధించాలని పుచ్చలపల్లి సుందరయ్య మునిసిపల్ హైస్కూల్ హెచ్‌ఎం డి.మోహన్ సూచించారు. కోచింగ్ సెంటర్లో కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు గురువారం గణితం, భౌతిక శాస్త్రానికి సంబంధించిన పుస్తకాలు ఉచితంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో ఇక్కడ ఉచితంగా కోచింగ్ తీసుకొని మంచి ర్యాంకులు సాధించిన వారు అనేక మంది ఉన్నారని తెలిపారు. మంచి గ్రూపుల్లో డిప్లొమాలో చేరి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ విద్యార్థులను అభినందించారు.

శ్రీమద్రామాయణం నిత్యనూతన మహాకావ్యం



విజయవాడ కల్చరల్: శ్రీమద్రామాయణం నిత్యనూతన కావ్యమని ఆధ్యాత్మికవేత్త మండలీక శ్రీకృష్ణకుమార్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో పున్నమ్మతోటలోని టీడీడీ కల్యాణ మండపంలో నిర్వహించే శ్రీమద్రామాయణ సప్తాహం వైభవంగా కొనసాగుతోంది. గురువారం శ్రీరాముడు ధర్మ స్వరూపుడు అంశంగా మండలీక శ్రీకృష్ణకుమార్ ప్రసంగించారు. శ్రీమద్రామాయణ కథా కేవలం పురాణం కాదన్నారు. భారతీయ ఆధ్యాత్మిక వైభవం రామాయణంలో కనిపిస్తుందన్నారు. ఏ దేశానికైనా, ఏ ప్రాంతానికైనా, ఏ కాలానికైనా సమాజానికి అవసరమైన అంశాలు రామాయణంలో కనిపిస్తాయని వివరించారు. శ్రీరాముడి ఏక పత్నీవ్రతం, సత్యవాక్ పాలన, దుష్టశిక్షణ రామాయంలో కనిపిస్తాయని, ప్రజారంజక పాలనను రామరాజ్యంలో పోలుస్తారని పేర్కొన్నారు. నేటి సమాజానికి రామరాజ్యం అవసరమన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అసిస్టెంట్ సి.వి.కె.ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రేమానురాగాలు పంచాలి

- ఈద్ నమాజ్‌లో మౌలానా ముఫ్తి రియాజ్ సందేశం
- ఐజీఎంసీ స్టేడియంలో ఘనంగా ఈద్ నమాజు
- ప్రార్థనల్లో పాల్గొన్న వెలంపల్లి, రుహుల్లా, దేవినేని అవినాష్



ఇందిరాగాంధీ స్టేడియంలో రంజాన్ సందేశం అందిస్తున్న మౌలానా ముఫ్తీ రియాజ్



సింగ్‌నగర్ షాదీఖానా ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వెలంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లా తదితరులు



రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లా

లబ్బీపేట(విజయవాడతూర్పు): పండుగ అంటే సంతోషమని, మానవులందరూ సుఖసంతోషాలతో ఉండటమే రంజాన్ ముఖ్య ఉద్దేశమని మౌలానా ముఫ్తి రియాజ్ అన్నారు. పవిత్ర రంజాన్‌ను పురస్కరించుకుని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో గురువారం సామూహిక ఈద్-ఉల్-ఫితర్ నమాజు జరిగింది. ఈద్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నమాజులో ముఫ్తి రియాజ్ ఉర్దూ ప్రసంగం, నమాజు దువా చేయించారు. ఈ సందర్భంగా ఆయన తన సందేశంలో దివ్య ఖురాన్ సర్వమానవాళి కోసం అవతరించిందని, ఉత్తమ సమాజ నిర్మాణానికి ప్రవక్త మొహమ్మద్ బోధనలు అనుసరించాలని సూచించారు. ప్రేమానురాగాలు పంచడం, పేదలను సంతోషాలలో భాగస్వామ్యం కల్పించడం ఈద్- ఉల్- ఫితర్ ముఖ్య ఉద్దేశమని వివరించారు. మన ఆరాధనలు నమాజులు స్వీకార యోగ్యం కావాలంటే అల్లా, ఆయన ప్రవక్త విధేయులుగా ఉంటూ పాపాలకు దూరంగా ఉండాలన్నారు. మౌలానా మక్బూల్ నద్వి ఈద్గాకు వచ్చి నమాజ్ చేయడం వలన కలిగే లాభాలను తెలుగులో వివరించారు. అందరూ సమైక్యంగా ఈద్గాలో నమాజ్ చేస్తే దైవ శుభాలను పొందటం సులభం అవుతుందన్నారు. మానవులందరూ సుఖ సంతోషాలతో మెలగాలని, పండుగలు ఒక వర్గం వారికే కాదని, మానవులు అందరికీ సంతోషదాయకం కావాలని ఆకాంక్షించారు. రంజాన్ నమాజులో వైఎస్సార్ సీపీ తూర్పు అభ్యర్థి దేవినేని అవినాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అవినాష్ మాట్లాడుతూ.. మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అన్నారు. నగరంలోని ముస్లింలు అందరూ సుఖ సంతోషాలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఈద్గా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కాలేషావలీ, మునీర్ అహ్మద్ షేక్, నగర పాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్, ఎండీఎస్ అధ్యక్షుడు ఎస్కే వలీ, వక్ఫ్‌బోర్డు రాష్ట్ర డైరెక్టర్ మీర్ హుస్సేన్, జిల్లా డైరెక్టర్ ఎండీ అబీద్, మైనార్టీ నేతలు ఎస్కే సుభానీ, ముస్లిం సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముఖ్తార్ అలీ, ఈద్ కమిటీ సభ్యులు అన్వర్, ఇర్ఫాన్, మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పులో రంజాన్ సందడి

లబ్బీపేట(విజయవాడతూర్పు): పవిత్ర రంజాన్‌ను పురస్కరించుకుని తూర్పు నియోజకవర్గంలో సందడి వాతావరణం నెలకొంది. లబ్బీపేట, ఫారూఖ్‌నగర్, సనత్‌నగర్, అయ్యప్పనగర్, కృష్ణలంక ప్రాంతాల్లోని ముస్లింలు ఉదయం పలు ప్రాంతాల్లో నిర్వహించిన ఈద్‌నమాజులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు అలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం, ఫారూఖ్ నగర్‌లో జరిగిన ఈద్‌నమాజులో వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ పాల్గొనారు. ఫారూఖ్‌నగర్ ప్రార్థనల్లో మంత్రి జోగి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో నిర్వహించిన ఈద్‌నమాజుకు సుమారు 10 వేల మందికిపైగా పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్, వాంబేకాలనీ, న్యూరాజరాజేశ్వరీపేట పరిసర ప్రాంతాల్లో గురువారం పవిత్ర రంజాన్ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. నెల రోజుల కఠోర ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు ఈద్ ఉల్ ఫితర్ పర్వదినాన్ని జరుపుకొన్నారు. వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెల్లంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లిం మత ప్రవక్తలను, పెద్దలను ప్రత్యేకంగా కలసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సింగ్‌నగర్ గుజ్జుల సరళాదేవి కల్యాణమండపం, షాదీఖానా దర్గా గ్రౌండ్, మస్జిద్ ఏ కరీమున్నీసా మదరసా, కండ్రిక మస్జిద్ ఏ హబీబ్, వాంబేకాలనీ ప్రాంతాల్లో జరిగిన ఈదుల్ ఫితర్ సామూహిక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లా మీడియాతో మాట్లాడుతూ.. ఆ అల్లాహ్ దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, రంజాన్ పండుగ వెలుగులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ముస్లిం మత గురువులు, స్థానిక ముస్లిం మైనార్టీల పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, ఎండీ హఫీజుల్లా, షేక్ అమిత్ తదితరులు పాల్గొన్నారు.

యాగశాల పనులు వేగవంతం కావాలి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి ప్రాంగణంలో నిర్మిస్తున్న యాగశాల పనులను మరింత వేగవంతం చేయాలని ఈఓ కె.ఎస్.రామరావు ఆదేశించారు. ఇంద్రకీలాద్రిపై నటరాజ స్వామి ఆలయం సమీపంలో నిర్మిస్తున్న యాగశాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ పనులపై దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. పనులను నాణ్యతా ప్రమాణాలు పాటించి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. నెలాఖరు నాటికి పనులు ఓ కొలిక్కి రావాలని స్పష్టంచేశారు. యాగశాలను త్వరలోనే ప్రారంభించి, భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. యాగశాలతో పాటు చుట్టు పక్కల పరిసరాలు కూడా అందంగా, ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దాలని సూచించారు. పూజా మండపాల వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. దుర్గగుడి స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యుడు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి పాల్గొన్నారు.

నేడు 63వ డివిజన్లో వెలంపల్లి పర్యటన

పాయకాపురం(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి 63వ డివిజన్‌లో పర్యటించనున్నారు. సుందరయ్యనగర్ రాముల వారి గుడి వద్ద నుంచి ఎన్నికల పర్యటన ప్రారంభమవుతుంది. ఈ పర్యటనలో స్థానిక కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ, డివిజన్ పార్టీ కోఆర్డినేటర్ పసుపులేటి యేసు తదితరులు పాల్గొంటారు.

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం



కేశినేని నాని, వెలంపల్లి శ్రీనివాస్‌కు మేక పిల్లలను బహూకరిస్తున్న స్థానికులు



విలేజి కండ్రికలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని నాని, వెలంపల్లి

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని నాని, వెలంపల్లి శ్రీనివాస్

పాయకాపురం(విజయవాడరూరల్): తమ ఎన్నికల ప్రచారానికి వస్తున్న ప్రజాస్పందనను చూస్తుంటే వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని), సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు. గురువారం రాత్రి 64వ డివిజన్ విలేజి కండ్రికలో వారు ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కేశినేని నాని మాట్లాడుతూ.. విలేజి కండ్రికలో ప్రజాస్పందన బ్రహ్మాండంగా ఉందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ అందుతున్నాయని ప్రజలు బహిరంగంగా చెప్పడం సంతోషంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక విలేజి కండ్రికలో అనేక అభివృద్ధి పనులు జరిగాయని స్థానికులు సంతోషం వ్యక్తంచేశారని పేర్కొన్నారు. ఈ ప్రజాస్పందన చూస్తుంటే తాము అఖండ మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమావ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన కేశినేని నాని, వెలంపల్లికి స్థానికులు మేక పల్లిలను బహూకరించారు. మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ హయాంలో బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతోందన్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టంచేశారు. కుట్రలు, కుతంత్రాలు చేసే వారు డబ్బు సంచులతో టీడీపీ టికెట్లు సంపాదించి పోటీ చేస్తున్నారని విమర్శించారు.

బస్సు యాత్రను విజయవంతం చేయండి

రాష్ట్ర ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 13వ తేదీన విజయవాడలో నిర్వహించే బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని) కోరారు. బస్సు యాత్ర వారధి మీదుగా తూర్పు నియోజకవర్గంలో ప్రవేశిస్తుందని, అక్కడ నుంచి సెంట్రల్ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించి గన్నవరం వెళ్తుందని వివరించారు. ఈ బస్సు యాత్రను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ, ఎస్.జగదీష్, పి.త్రివేణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివకామేశ్వరికి తమలపాకులతో అర్చన



మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీ దత్త సాయి శివ కామేశ్వరి పీఠంలో గురువారం వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన అమ్మవారికి తమలపాకులతో అర్చన జరిగింది. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

గాయకులను ప్రోత్సహించాలి



విజయవాడ కల్చరల్: గాయనీ గాయకుల్లో ప్రతిభను ప్రోత్సహించాలని మహీస్వరాలు సాంస్కృతిక వేదిక అధ్యక్షురాలు మహేశ్వరి అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై గురువారం సినీ సంగీత విభావరి, ఏక గళ విభావరి గాయకుడు శేషగిరిరావుకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. గాయకుడు శేషగిరిరావు, పలు తెలుగు, హిందీ చిత్రగీతాలను మధురంగా ఆలపించారు. నిర్వాహకులు శేషగిరిరావును ఆత్మీయంగా సత్కరించారు. సంస్థ కార్యవర్గ సభ్యులు లక్ష్మి, అమృత వల్లి, మల్లీశ్వరి, పద్మశ్రీ, భాను సహస్ర, చింతకాయల చిట్టిబాబు, బి.వి.వీరభద్రరావు పాల్గొన్నారు.

పూలే ఆశయాలను సాధిస్తున్న సీఎం వైఎస్ జగన్

రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి



జ్యోతీరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అయోధ్యరామిరెడ్డి,వెలంపల్లి, అవినాష్ తదితరులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిరుపేద ప్రజలకు ఉజ్వల భవిష్యత్తును ప్రసాదించేందుకు అనేక పోరాటాలు చేసి, ఆదర్శజీవితాన్ని గడిపిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతీరావు పూలే అని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి కొనియాడారు. ఆయన కన్న కలలను, ఆ మహనీయుని ఆశయాలను నిజం చేసి చూపిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ కార్యాలయంలో మహాత్మా జ్యోతీరావు పూలే జయంతిని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అయోధ్యరామిరెడ్డి సెంట్రల్, తూర్పు, వెస్ట్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు వెలంపల్లి శ్రీనివాసరావు, దేవినేని అవినాష్, షేక్ ఆసిఫ్‌తో కలిసి జ్యోతీరావు పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ.. సమాజంలోని అసమానతలను రూపుమాపేందుకు పూలే చేసిన పోరాటాలు, ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. పూలే కన్న కలలను ఆచరణలో చేసి చూపుతున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. బీసీల అభ్యున్నతికి జగనన్న చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నగర అధ్యక్షుడు బోను రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు బీహెచ్ఎస్వీ జానారెడ్డి, బాలి గోవింద్, బీసీ నాయకులు లాకా వెంగళరావు యాదవ్, బోను దుర్గా నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాను గుర్తుకు ఓటు.. అభివృద్ధి, సంక్షేమానికి చోటు



26వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న వెలంపల్లి సతీమణి శ్రీవాణి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ పేదల పార్టీ అని, ఫ్యాను గుర్తుకు ఓటు వేస్తేనే అభివృద్ధి, సంక్షేమానికి చోటు లభిస్తుందని పార్టీ సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు సతీమణి శ్రీవాణి అన్నారు. స్థానిక 26వ డివిజన్ మాచవరంలో గురువారం వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి అంగిరేకుల గొల్లభామ నాగేశ్వరరావు వెలంపల్లి కుటుంబ సభ్యులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గడప గడపకూ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ప్రజారంజకంగా సుపరిపాలన అందిస్తున్న జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని నిండు మనస్సుతో ఆశీర్వదించాలని కోరారు. అహర్నిశలు ప్రజలకు అండగా ఉండే వెలంపల్లి శ్రీనివాసరావుకు ఓట్లు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వెలంపల్లి మీనాక్షి, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి జ్యోతీరావు పూలే



జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మధురానగర్(విజవాడసెంట్రల్): జ్యోతీరావు పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆయన చూపిన మార్గంలో పయనించాలని బీసీ సంక్షేమ సంఘం నాయకుడు వీరంకి గోకర్ణేశ్వరరావు, వాకర్స్ క్లబ్ డెప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ అన్నారు. స్థానిక బావాజీపేటలో బీసీ సంక్షేమ సంఘం, బీఆర్‌టీఎస్ రోడ్డు వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన గురువారం మహాత్మా జ్యోతీరావు పూలే జయంతి కార్యక్రమం జరిగింది. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేలను గుర్తు చేసుకున్నారు. అనంతరం పండ్లు, మిఠాయిలు, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ సభ్యులు కొండాయగుంట రాము, గుర్రం ఏడు కొండలు, బి. సీతారామయ్య, హేమంతరావు తదితరులు పాల్గొన్నారు.

రంజింపజేసిన నవ దుర్గ నృత్యరూపకం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో గురువారం సాయంత్రం కూచిపూడికి చెందిన చింతా రవి బాలకృష్ణ కళాబృందం ప్రదర్శించిన నవ దుర్గ నృత్యరూపకం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా ధర్మపథం వేదికపై పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మూడో రోజైన గురువారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ యువ పురస్కార్ గ్రహీత చింతా రవి బాలకృష్ణ బృందం ప్రదర్శించిన నృత్య రూపకాన్ని వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు వేదిక వద్దకు తరలి వచ్చారు. కళాకారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో లయబద్ధంగా నృత్య రూపకాన్ని ప్రదర్శించగా, భక్తులు ఆద్యంతం ఆసక్తిగా వీక్షించారు. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించగా, ఆలయ ఈఓ రామరావు వారిని సత్కరించి ప్రసాదాలను అందజేశారు.

పార్టీలు మారటం పైలాకు అలవాటే

వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ నగర అధ్యక్షుడు పోతిరెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలు మారడం పైలా సోమినాయుడుకు అలవాటేనని వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ నగర అధ్యక్షుడు పోతిరెడ్డి సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీజేపీ పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరి సమక్షంలో ఆ పార్టీలో గురువారం చేరిన సోమినాయుడికి పశ్చిమంలో ఓటే లేదని తెలిపారు. తొలుత కాంగ్రెస్, ఆ తరువాత ఎన్డీ తివారి కాంగ్రెస్‌లో చేరి విజయవాడ ఎంపీగా పోటీ చేసి ఘోరంగా ఓటమి పాలయ్యారని గుర్తుచేశారు. ఆ తరువాత మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరి లగడపాటి రాజగోపాల్ ద్వారా సిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడయ్యాడని, అనంతరం వైఎస్సార్ సీపీలో చేరి దుర్గగుడి చైర్మన్‌గా చేశారని, దాని కాలపరిమితి పూర్తయ్యాక గుంటూరు జిల్లా పెదకూరపాడు వైఎస్సార్ సీపీ పరిశీలకుడిగా ఉన్న విషయం ప్రజలందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. ఇంత చేసిన వైఎస్సార్ సీపీ తనను గుర్తించటం లేదని పైలా వాపోవడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవాచేశారు. గతంలో పైలా ఒక సారి, ఆయన భార్య ఒకసారి పశ్చిమ నియోజకవర్గంలో కార్పొరేటర్లుగా పోటీ చేసి పరాజయం పాలయ్యారని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఓటమి తప్పదన్న నిరాశ, నిస్పృహలో ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పైలా సోమినాయుడు వంటి పార్టీ ఫిరాయింపుదారులను చేర్చుకోవడంలో ఆశ్చర్యం ఏమీ లేదని పేర్కొన్నారు.

లవ్ మౌళి చిత్ర యూనిట్ సందడి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నవదీప్ నటించిన లవ్ మౌళి చిత్రం ప్రమోషన్‌లో భాగంగా రాజ్-యువరాజ్ థియేటర్‌లో ఆ సినిమా యూనిట్ గురువారం సందడి చేసింది. ఈ సందర్భంగా చిత్ర ట్రైలర్‌ను రిలీజ్‌చేశారు. అనంతరం హీరో నవదీప్ మాట్లాడుతూ.. లవ్ మౌళి చిత్రం ఈ నెల 19వ తేదీన విడుదలవుతుందని తెలిపారు. చిత్ర ప్రమోషన్‌ను విజయవాడ నుంచి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. సినిమా షూటింగ్ 99 శాతం మేఘాలయ రాష్ట్రంలోనే చేశామని, అసలు మన ఇండియాలో ఆ రేంజ్ లొకేషన్స్ ఉన్నాయా అని ఆశ్చర్యపోయామని పేర్కొన్నారు. ఈ ప్రేక్షకులు తప్పక వీక్షించి ఆదరించాలని కోరారు. అనంతరం హీరోయిన్ ఫంకూరి గిద్వానీ మాట్లాడుతూ.. తెలుగులో తాను నటించిన మొదటి చిత్రం ఇదని, తన క్యారెక్టర్ ప్రేక్షకులకు నచ్చుతుందని పేర్కొన్నారు. గేయ రచయిత అనంత్ శ్రీరామ్ మాట్లాడుతూ.. దర్శకుడు అవనీంద్ర కోరిక మేరకు మేఘాలయకు వెళ్లామని, ఈ సినిమా పాటలన్నీ ఆ ప్రాంతంలోనే రాశానని తెలిపారు. ప్రతి పాటా ప్రేక్షకుడి హృదయాన్ని హత్తుకునేలా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నటి భావన పాల్గొన్నారు.